

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సోమవారం నిర్వహించనున్న 'డయల్ యువర్ కమిషనర్' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ , అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణకు ఉదయం 10.30 నుండి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' నిర్వహిస్తామన్నారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208 కు కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ప్రజలకు కమిషనర్ తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరచి, ఫోన్ నెంబర్లను తెలపాలని కమిషనర్ పేర్కొన్నారు.

అమిత్ షాను తొలగించాలి

- కేంద్ర హోం మంత్రికి నిరసనల సెగ
- సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి నాయకుల ధర్నా

తిరుపతిలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఏ రామానాయుడు మాట్లాడుతూ ఇటీవల పార్లమెంటులో సమావేశాల సందర్భంగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను పదవి నుండి వెంటనే తొలగించాలని కోరారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ వైఖరిని తప్పుపట్టారు. పథకం ప్రకారమే ఉద్దేశపూరితంగా అమిత్ షా అంబేద్కర్ అవమానిం చారన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని ప్రజలకు అందించేందుకు ఆర్ఎస్ఎస్ బిజెపి కుట్ర పన్నుతోందని బీజేపీ చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. విభజన చట్టంలోని హామీలను తుంగలో తొక్కి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. బిజెపికి చిత్తశుద్ధి వుంటే ప్రధానమంత్రి తక్షణం జోక్యం చేసుకుని అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని వామపక్ష పార్టీల నాయకు లు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రహ్మణ్యం, ఎం మాధవ్ కృష్ణ, పి బుజ్జి, పి హేమలత, ఎం నరేంద్ర, పి రమేష్, రాము, సుధాకర్, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, కేతరి రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్డీ రవి, శివారెడ్డి, శ్రీరాములు, కేవైరాజా, ఉదయ్, శివ ,అల్లా బాషా, రామకృష్ణ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేష్ లోకేష్ పాల్గొన్నారు.

రేణిగుంటలో

పుత్తూరులో

పుత్తూరు టౌన్ : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు 'గో బ్యాక్.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేని అమిత్ షా రాష్ట్రానికి వచ్చే అర్హత లేదు.. గో బ్యాక్..!' అంటూ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి నాయకులు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి మహేష్, సిపిఎం శాఖ కార్యదర్శి భాస్కర్, బీఎస్పీ సత్యవేడు ఇన్‌ఛార్జి ధనుంజయులు, సిపిఎం పట్టణ అధ్యక్షులు భాస్కర్, సుబ్రహ్మణ్యం పిళ్లై, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఏ విజయ్, సిపిఐ పట్టణ కార్యదర్శి మహేష్, రవి పాల్గొన్నారు.

గూడూరులో

రేణిగుంట: బిఆర్ అంబేద్కర్‌పై రాజ్య సభలో అవమానకరమైన, అప్రతిష్ఠకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ధర్నా చేపట్టారు. 'గో బ్యాక్.. గో బ్యాక్.. అమిత్ షా!.. కేంద్ర హోం శాఖ మంత్రి పదవి నుండి అమిత్ షా ను వెంటనే బిజెపి అధిష్టానం తొలగించాలి.. విజయవాడ పర్యటనను అమిత్ షా విరమించుకోవాలి..' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరమణ, దిలీప్ బాషా, టీసుకుని కార్యదర్శి ఈశ్వరమ్మ, రూరల్ కార్యదర్శి సెల్వరాజ్, చీరాలయ్య రాజశేఖర్, శ్రీనివాసులు, పద్మమ్మ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్లి పోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్గనైజర్ జోగి శివ కుమార్ మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు దేశ ప్రధాని మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వెంటనే తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్, నరసింహులు, సీపీఐ నాయకులు శశికుమార్, మస్తానయ్య, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

తిరుపతిలో రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతిలో. నూతన రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ 1, 2 భవనాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్ గా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవాడ వేదిక గా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డిజిపి ద్వారకా తిరుమల రావు, ఇతర ప్రముఖులు హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి వివిఎన్ మణికంఠ చందోలు మాట్లాడుతూ తిరుపతిలో నూతనంగా ప్రారంభమైన డీఎన్ఏ విభాగం ఫోక్సో కేసులు, ఇతర గంభీరమైన కేసులకు సంబంధించిన డీఎన్ఏ శాంపిళ్లను ఇక్కడే టెస్ట్ చేస్తారని, ఒకప్పుడు విజయ వాడ కు పంపాల్సిన అవసరం ఉండేదని, ఈ సేవల ను తక్షణమే స్థానికంగా పొందడం సులభమ వుతుందన్నారు. ప్రత్యేకంగా ఆడియో, వీడియో టేపులకు సంబంధించి నేర పరిశోధనలు, నేర ఆధారాల సేకరణ ఇక్కడ నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు, రోజు రోజుకీ పెరిగి సమస్యగా మారుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాల నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, చిన్నచిన్న ఆధారాలను నిశితంగా పరిశీలించేందుకు ఈ ల్యాబ్ ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు సంబంధించి నేర నిరూపణ ప్రక్రియ వేగవంతం అవుతుందని, పది రోజుల్లోపే ఫలితాలు లభ్యమయ్యే అవకాశం ఉన్నందున, నేర విచారణల సమర్థతను మెరుగుపరచడం ద్వారా న్యాయ సంస్థకు కీలకమైన మద్దతు లభించి, తప్పు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్షపడేలా అవకాశం ఉంటుందని, బాధితులకు కూడా సకాలంలో న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ ఫోరెన్సిక్ ల్యాబ్ ఆధ్వర్యంలో నేర విచారణలో సాంకేతిక నైపుణ్యాలను మరింతగా వినియోగించి, న్యాయ వ్యవస్థలో న్యాయం వేగవంతంగా జరగాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం ఎస్‌పి ల్యాబ్ లోని సాంకేతికపరమైన సామగ్రిని, పరిశీలించి, పనితీరును అధికారులను అడిగి తెలుసుకుని మరింత మెరుగైన సేవలను అందించి మంచి ఫలితాలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహర్ ఆచారి, జేడీ వి ఈశ్వరమ్మ, డీఎస్పీలు గిరిధర్, వెంకటనారాయణ, రామకృష్ణ ఆచారి, రవీంద్రారెడ్డి, సిఐలు రామకిషోర్, రామయ్య, రాజశేఖర్ రెడ్డి, ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వర్చువల్‌గా ప్రారంభించిన తిరుపతి రిజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ

ఫ్లెమింగో ఫెస్టివల్‌లో శ్రీసిటీ స్టాల్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - తడ: సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, పర్యాటకులు, సామాన్య ప్రజల సందర్శకులతో విశేష స్పందన లభించింది. ఈ స్టాల్‌లో చాక్లెట్లు, ఆహార పదార్థాలు, ఎయిర్ కండీషనర్లు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, లైట్ ఇంజినీరింగ్ రంగాల ఉత్పత్తుల నమూనాలతో శ్రీసిటీ ప్రగతిని దృశ్య మాధ్యమంగా అద్భుతంగా ప్రదర్శించారు. పారిశ్రామిక విజయాలతో పాటు, సుస్థిరత, సామాజిక సంక్షేమంపై శ్రీసిటీ నిబద్ధతను స్టాల్ హైలైట్ చేసింది. పరిశ్రమలతో పాటు హరిత హిత కార్యక్రమాలు, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన కార్పొరేట్ సామాజిక బాధ్యతా (సియస్ఆర్) ప్రాజెక్టులు, ప్రకృతి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహిం చడానికి తీసుకున్న చర్యలను ప్రతిబింబించే ఆకర్షణీయ ఫొటో డిస్‌ప్లేలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శ్రీసిటీ ప్రస్థానాన్ని వివరిస్తూ సాగిన వీడియో ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. పారిశ్రామిక పురోగతినే కాకుండా స్థిరమైన అభివృద్ధిలో దానికున్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ సందర్శకులపై బలమైన ముద్రవేసింది. సమాజం, పర్యావరణం పట్ల శ్రీసిటీ యాజమాన్య బాధ్యతాయుత చర్యలను సందర్శకులు ప్రశంసించారు. ఈ ప్రదర్శనను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా శాఖ గౌరవ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించిన విషయం తెలిసిందే.. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో ప్రదర్శన ప్రాంగణంలో నీరు నిలిచినా సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా ఫెస్టివల్ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

శ్రీసిటీ స్టాల్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోస్టర్ ఆవిష్కరణలో ఎస్ఎఫ్ఐ నాయకుల పిలుపు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 5వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక ఎస్‌వి యూనివర్సిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు అక్బర్, రవి మాట్లాడుతూ తిరుపతి జిల్లా మహాసభ లు యూనివర్సిటీలో ఈ నెల 28,29 తేదీలలో నిర్వహిస్తామని, గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు ఉద్యమాలను రూపలక్పనకు ఈ 5 వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. టెంపుల్ సిటీలో టీటీడీ విద్యా సంస్థలు తప్ప ప్రభుత్వ విద్యా సంస్థలు లేక స్థానిక పేద విద్యార్థులు వేల రూపాయలు చెల్లించక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోను ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలు అనేకం నెలకొన్నాయని, విద్యార్థులకు అనుగుణంగా వసతి గృహాలు లేక వేల మంది విద్యార్థులు పీజీలో ఉంటూ ఆరు వేలు చెల్లించలేక ప్రత్యామ్నాయంగా పార్ట్ టైం జాబ్ లు చేస్తూ విద్య రెగ్యులర్‌గా కొంసాగించలేక పక్క దారి పడుతున్నారని వాపోయారు. టీటీడీ విద్యా సంస్థలో సీటు వచ్చిన విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్ లేక అవస్థలు పడుతున్నారని, పాలిటెక్నిక్ కళాశాల ఉన్న పురాతన భవనం వర్షం పడితే పెంకులు ఎప్పుడు ఊడి పడి విద్యార్థుల తలలు పగులుతాయో తెలియని ఆందోళనలో విద్యార్థు లు ఉన్నారన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం అవుతామని తెలిపారు. జిల్లా మహాసభలకు జయప్రదానికి విద్యార్థులు, విద్యా వేత్తలు, శ్రేయోభిలాషులు అందరూ ఉద్యమ అభివృద్ధికి సలహాలు, సూచనలు, సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి బాల, యూనివర్సిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారి

- జక్కలవారిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీని వేగంగా ఢీకొట్టిన కారు
- ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ దుర్మరణం
- ముగ్గురికి తీవ్రగాయాలు,
- ఒకరి పరిస్థితి విషమం
- బాధితులు తమిళనాడు వాసులుగా గుర్తింపు

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరి మండలంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి మరో సారి నెత్తురోడింది. జక్కలవారిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందగా, ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..

తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన కార్తీకేయ (50) కుటుంబ సభ్యులు సతీష్ (35), కలైవేణి (45), ఐశ్వర్య (30), జీవన్ (10), విశ్వ (06) తో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి బయల్దేరారు. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై జక్కలవారిపల్లి వద్ద వస్తున్న క్రమంలో ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో చిత్తూరు వైపు వస్తున్న లారీని కారు ఢీకొంది. కారు వెళుతున్న వేగానికి కారు మందు భాగం పూర్తిగా లారీ కిందికి దూసుకుపోయింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు చిన్నారులు జీవన్, విశ్వ అక్కడికక్కడే మృతి చెందారు. కార్తికేయతో పాటు సతీష్, కలైవేణి, ఐశ్వర్యలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన తోటి ప్రయాణికులు హుటాహుటిన ఘటన స్థలం వద్దకు చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108 లో తిరుపతి రుయా కు తరలించారు. మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కలైవేణి (45) మరణించింది. కార్తికేయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న మరో ఇద్దరు క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా వుంది. ముందు వెళ్లే వాహనాన్ని అధిగమించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక అంచనా వేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో గుమికూడిన ప్రజలు

జ్వరాల నివారణకు వైద్యశిబిరం

ప్రజాశక్తి-బిఎన్ కండ్రిగ: మండలంలోని పెదపాడు వీడు హరిజనవాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు పర్యవేక్షణ లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందిచే ఇంటింటికి వెళ్లి జ్వరపు కేసులను గుర్తించారు. ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిలో ఉన్న లార్వాలను తొలగించారు. జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. దోమల ద్వారా వ్యాప్తి, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, మొదలైన జబ్బులు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి లోపల నీరు నిలవకుండా చూడడం, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించడం, ఇంటి చుట్టూ నీరు నిలవకుండా చూడడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటిని కాచి చల్లార్చి తాగాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ మృదులవాణి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల చెంత కంపు కంపు!

- రోడ్డుకిరువైపులా కుళ్లిన వ్యర్థాలు
- చిరుతల సంచారానికి ఇదో కారణం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీవారి పాదాల మండపం వద్ద ఉన్న అలిపిరి మార్గం దుర్గంధానికి నెలవుగా మారింది. అలిపిరి బైపాస్‌రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా మాంసం వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, బిల్డింగ్ వ్యర్థాలు నిత్యం దర్శనమిస్తాయి. ఆ మార్గాన వచ్చే భక్తులు దుర్వాసన తట్టుకోలేక ముక్కున వేలేసుకుంటున్నారు. నిత్యం ఆ మార్గంలో పయనించే అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. చిరుతల సంచారానికి ఇదే ప్రధాన కారణం కావడం గమనార్హం.

శ్రీవారి దర్శనానికి తిరుమలకు చేరుకోవాలంటే అలిపిరి ప్రధాన మార్గం. నడకదారికి కానీ, ఘాట్‌రోడ్డు ప్రయాణానికి గాని అదే తొలి అడుగు. ఆ ప్రాంతం మొత్తం అన్నమయ్య సంకీర్తనలు నిత్యం అలరాలుతుంది. బెంగుళూరు, వేలూరు, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే యాత్రికులు నగర ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా తక్కువ దూరంలో అలిపిరికి చేరుకునేందుకు చెర్లోపల్లి-అలిపిరి మార్గంలో 7 కిలోమీటర్ల మేర బైపాస్‌రోడ్డును ఏర్పాటు చేశారు. శ్రీనివాస మంగాపురం, శ్రీవారిమెట్టుకు వెళ్లేందుకు ఈ ప్రధాన మార్గం. ఈ మార్గంలో వేదిక్ యూనివర్సిటీ, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, అగ్రికల్చరల్ యూనివర్సిటీ, స్విమ్స్ యూనివర్సిటీ, ఎస్‌వి యూనివర్సిటీలు ఉన్నాయి. నిత్యం సందర్శకుల తాకిడి ఉన్న ఎస్‌వి జూ పార్కు, సైన్స్ సెంటర్, ప్రముఖ కంటి చికిత్సాలయం, అరవింద కంటి ఆసుపత్రి, టాటా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌వి క్యాన్సర్ ఆసుపత్రి, ఏపి టూరిజం హోటల్‌మేనేజ్‌మెంట్ కళాశాల, హాస్టల్, భారతీయ విద్యాభవన్, టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిన్నపిల్లల హృదయాలయం, ఎస్‌విబిసి కేంద్రాలకు ఆ మార్గంలోనే వెళ్లాలి. నిత్యం ప్రశాంత వాతావరణంలో, పచ్చని చెట్లతో ఆ మార్గం ఆహ్లాదకరంగా ఉంటుంది. అలాంటి ప్రాంతం అధికార్ల నిర్లక్ష్యం కారణంగా దుర్గంధానికి నెలవుగా మారింది. నగరంలోని మాంస విక్రయాల్లోని వ్యర్థాలను ఆ మార్గంలోని రోడ్డుకు ఇరువైపుల డంప్ చేస్తున్నారు. కొబ్బరి బోండాల చిప్పలు, భవన నిర్మాణాల వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, హోటళ్లో వినియోగించి ఎంగిలి విస్తర్లు తదితర వ్యర్థాలన్నిటికి డంపింగ్ కేంద్రంగా ఆ మార్గం నిలుస్తోంది. కుళ్లిన వ్యర్థాలను తినేందుకు ఆ మార్గం పొడవున కుక్కలు గుంపులు గుంపులుగా తచ్చాడుతుంటాయి. వాటి వల్ల ఆ మార్గంలో పయనించే వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కలు వాహనాలపైకి ఎగబడుతుండడంతో చిన్న చిన్న ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పైగా ఇటీవల కాలంలో చిరుతల సంచారం కూడా ఆ ప్రాంతంలో అధికమైంది. దానికి ప్రధాన కారణం వ్యర్థాల కోసం కుక్కలు రావడంతో, ఆ కుక్కల కోసం చిరుతలు అలిపిరి బైపాస్‌రోడ్డులోకి ప్రవేశిస్తున్నాయి. వీటి వల్ల వాహనదారులు, పాదచారులు, పలు యూనివర్సిటీల విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే మిట్టమధ్యాహ్నం బైక్‌పై వెళుతున్న ఓ టిటిడి ఉద్యోగిపై చిరుత దాడి చేసిన ఘటన సైతం చోటు చేసుకుంది. ఆ మార్గం మొత్తం ఎర్రచందనం, శ్రీగంధం చెట్లతో నిండి ఉండడంతో నిత్యం ఫారెస్టు అధికారులు, సిబ్బంది ప్రహార కాస్తూనే ఉంటారు. టిటిడి ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఆ మార్గంలో పయనిస్తూ, నిత్యం చూస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే మార్గంలో టిటిడి సంస్థలకు నీటి సరఫరా చేసే వాటర్ ప్లాంట్ సైతం ఉండడం గమనార్హం. నిత్యం కోట్లాది రూపాయల భక్తుల సొమ్ముతో నడిచే టిటిడి, ఈ మార్గాన్ని నిత్యం పచ్చగా ఉంచేందుకు ప్రత్యేకించి కొంత సొమ్మును కూడా కేటాయించింది. వాటికి లెక్కలు చూపే అధికారులు, ఈ మార్గంపై నిఘా పెట్టకపోవడం విడ్డూరం. చిరుతలు సంచరిస్తుంటే భక్తులు, యాత్రికులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించే టిటిడి, ఫారెస్టు అదికారులు, చిరుతల సంచారానికి ప్రధాన కారణమైన వ్యర్థాలను తొలగించి, ఆ మార్గంలో వ్యర్థాలను డంప్ చేయనీయకుండా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆ మార్గంలోని వ్యర్థాలను తొలగించి, భక్తులను దుర్వాసన నుంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డంతా కంపు కంపు

వెంకటేశ్వరస్వామి గుడికి వచ్చే అలిపిరి రోడ్డంతా కంపు కంపుగా వుంది. రోడ్డుకు రెండు పక్కల ఎక్కడ చూసిన చెత్తచెదారమే. వాటి కోసం కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగు తున్నాయి. ఆ రోడ్డులో వచ్చే వాళ్లపైకి విరుచుకు పడుతు న్నాయి. టిటిడి అధికారులు ఇలాంటి వాటిపై స్పందించక పోవడం బాధాకరం.

-మోహన్, ల్యాబ్‌టెక్నీషన్, బెంగుళూరు.

ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది



శనివారం స్వామికి మొక్కు చెల్లించుకోవాలని తిరుపతికి వచ్చాం. అలిపిరి వద్ద ఆగి స్వామి పాదాలకు దండం పెట్టుకుందామనుకుంటే ఆ మార్గంలో వచ్చే దుర్వాసన ఏకాగ్రతను పాడు చేసింది. మొక్కాల్సిన చోట ముక్కున వేలేసుకోవాల్సి వస్తోంది. అలిపిరికి అత్యంత దగ్గర్లోనే కుళ్లిన వస్తువులు దిబ్బలు దిబ్బలుగా ఉండడం బాధాకరం. టిటిడి ఇలాంటి వాటిపై దృష్టి సారించాలి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామంటున్న టిటిడి, కనీసం కంపుకొట్టే పదార్థాలను కూడా తొలగించకపోవడం సరికాదు..

-మహాదేవన్, కోలార్, కర్ణాటక.

కుల, మత, వర్గ రహిత సమాజమే వేమన తత్వం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కుల, మత, వర్గ రహిత సమాజ స్థాపనే వేమన తత్వమని పలువురు పేర్కొన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని తిరుపతి వేమన విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వేమన చిత్రపటానికి పలువురు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్విహించిన సభకు వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున అధ్యక్షతన వహించారు. సభలో ఎస్‌వి యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ వేమన కవిని తెలుగు జాతి ప్రపంచానికి ఇచ్చిన కానుకగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, కొన్ని శతబ్దాల క్రితం తన కవిత్వం ద్వారా సమాజాన్ని మేలుకొలిపాడన్నారు. కుల, మత, వర్గ రహిత సమాజాన్ని ఆయన ఆశించాడన్నారు. వేమన భావజాలం నేటి యువత అందుకోవాలని కోరాడు. వేల పద్యాలు రచించాడు వేమన. ప్రక్షిప్తాలు ఎన్ని ఉన్నా నిక్షిప్తాలకూ కొదవలేదని, కవిత్వానికి పాండిత్య ప్రకర్ష అవసరం లేదని తేల్చిచెప్పాడన్నారు. ఓ సత్యాన్వేషిగా, నిత్యాన్వేషిగా, నిత్యం మనుషుల మధ్య తిరుగాడుతూ మానవ జీవన సత్యాలనే తేలిక పదాలతో నిర్భయంగా చెప్పాడని పేర్కొన్నారు. మట్టిమనుషులు మట్టి పరిమళాన్ని అనుభవించకపోతే ఎలా? తాను అనుభవిస్తూ ఇతరులు అనుభవించేలా చేయగలిగిన గొప్ప దార్శనికుడు వేమన అని వక్తలు అన్నారు. ఇప్పుడు అశాస్త్రీయ భావజాలం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోందని, వేమన ఇలాంటి వాటిని ముందే పసిగట్టి తన పద్యాల ద్వారా సూటిగా ప్రశ్నించారన్నారు. ఆయన పద్యాలలో పదునైన విమర్శ ఉంటుందని, అందుకే ప్రజల నాలుకలపై ప్రజాకవిగా చిరకాలం జీవిస్తూనే ఉంటాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రేడియో ఉపసంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, నడ్డినారాయణ, మోహనమూర్తి, నెల్లూరు మునిలక్ష్మి, తహసున్నీసా, ఓ వెంకటరమణ, పంచముఖేశ్వర రావు, ఆమూరి సుబ్రహ్మణ్యం లక్ష్మీదేవి, ప్రవీణ్ వేమన పద్యాలు ఆలపించి నివాళులు అర్పించారు.

వేమనకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఏనుగుల దాడిలో ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి మృతి

- శోకసంద్రంలో కందులవారిపల్లి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లి కి సమీపాన పంట పొలాలలో ఏనుగుల దాడిలో కందుల వారిపల్లి ఉప సర్పంచ్ ఎం రాకేష్ చౌదరి (33)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు శనివారం అర్ధరాత్రి పరిసర ప్రాంతాలలోని రైతుల పొలాలలో ఏనుగులు సంచరిస్తున్నాయని సమాచారం రావడంతో కందుల వారి పల్లి పంచాయతీ ఉప సర్పంచ్, చంద్రగిరి మండల ఐ టీడీపీ అధ్యక్షుడు రాకేష్ చౌదరి వాటిని తరిమేందుకు గ్రామలలోని కొంత మంది రైతులతో కలిసి పొలాల వద్దకు చేరుకున్నారు. ఏనుగులను తరిమే ప్రయత్నంలో ఏనుగులు రైతులపై తిరగబడి తరుముకున్నాయి. శనివారం రాత్రి ఏనుగుల దాడి చేయడంతో ఒకరు చెట్టు పైకి ఎక్కగా, రాకేష్ చౌదరి పరుగులు తీయగా, టార్చ్ లైట్ వెలుతురు, తెల్ల చొక్కా వేసుకోవడంతో అతడిని వెంబడించి ఏనుగు దాడి చేసింది. ఏనుగు దాడిలో రాకేష్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఎం రాకేష్ చౌదరి అత్యంత సన్నిహితుడు. ఏనుగుల దాడిలో రాకేష్ చౌదరి మృతి చెందినట్లు స్థానికులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి సమాచారం తెలపడంతో ఎమ్మెల్యే పులివర్తి నాని అటవీశాఖ, పోలీస్ అధికారులను, టిడిపి నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులను, నాయకులను అడిగి తెలుసుకున్నారు. హుటాహుటిన ఎమ్మెల్యే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాకేష్ మృతదేహాన్ని పరిశీలించి ఎమ్మెల్యే పులివర్తి నాని కన్నీటి పర్యంతమయ్యారు. రాకేష్ చౌదరికి, తల్లి జ్యోతి, భార్య లక్ష్మి, ఏత్రిక సంవత్సరాల కుమార్తె ఉన్నారు. రాకేష్ చౌదరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబ సభ్యులు పరామర్శించి, ఓదార్చి తాము అండగా వుంటామని ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం రాకేష్ మృత దేహాన్ని చంద్రగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించారు. రాకేష్ కుటుంబ సభ్యులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

అంతిమ వీడ్కోలులో పాల్గొన్నచంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ఆత్మీయ అంతిమ వీడ్కోలు

చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో ఎం రాకేష్ చౌదరి మృత దేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం భౌతిక కాయాన్ని మాడిమానుగడ్డ లోని రాకేష్ స్వగృహానికి తరలించారు. మాడిమానుగడ్డ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాకేష్ భౌతికాయానికి ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డి, పులివర్తి వినిల్, శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడులు పార్టీ కండువాను కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాకేష్ చౌదరి మృతి పార్టీకి తీరనిలోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబ సభ్యులు, శాప్ ఛైర్మన్ ఏ రవి నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, ఏజీ పల్లి బాలకృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి అన్ని తానై రాకేష్ చౌదరి అంతిమయాత్రలో పాడే మోసి ఆత్మీయతను చాటుకున్నారు.

క్వారీ కాలుష్యం

- ప్రజలకు శాపం
- నిద్రావస్థలో అధికారులు

భయాందోళనకు గురి చేస్తున్న క్వారీ పేలుడు

ప్రజాశక్తి- కేవిబి పురం: కెవిబి పురం మండలంలోని మఠం గ్రామ సమీపంలో ఉన్న పెరిందేశం రెవెన్యూలోని వీజే ఇన్ఫ్రా స్ట్రక్చర్ క్వారీని 2005లో క్వారీని కొందరు రాజకీయ నాయకుల సాయంతో ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల రైతులు వ్యతిరేకించడంతో ఈ క్వారీ వల్ల ఎంతో మందికి ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పి ఈ క్వారీని ఏర్పాటు చేశారని గ్రామస్తులు వాపోయారు.

ప్రజలకు శాపం

ప్రస్తుతం క్వారీ నుండి వెలువడుతున్న కాలుష్యం ప్రజలకు శాపంగా మారింది. క్వారీకి ఆనుకొని చుట్టుపక్కల ఉన్న బ్రాహ్మణపల్లి, గురుకుల కండ్రిక, రంగయ్యగుంట గ్రామ ప్రజలకు పంటలు పండించలేకపోతున్నామని క్వారీ నుండి వస్తున్న కాలుష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రాహ్మణపల్లి ,గురుకుల కండ్రి గ్రామాల రైతులు పాల్గొని గ్రామానికి సమీపంలో ఉన్న కంకర క్వారీ నుంచి వెలువడే విష వ్యర్థ, రసాయనాల, కాలుష్యాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, జల కాలుష్యం వల్ల ఆ నీళ్ల తాగిన పశువులు, పంటలు రోగాల బారిన పడుతున్నాయని అప్పులు తీర్చలేక పంటలు పెట్టలేక తీవ్ర ఇబ్బంది లెదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోయారు.

క్వారీ కాలుష్యానికి నాశనమవుతున్న పంటలు

రైతులు పంటలు వదిలేశారు..

క్వారీ సమీపంలో 2వేల ఎకరాలు ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 330, 331 నెంబర్ లో ఉన్న భూమిని నిరుపేదల దళితులకు నాలుగో విడత, ఐదో విడత భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేశారు. వారు వారి పొలంలో చెట్టు పుట్ట కొట్టుకుని సాగు చేసుకుంటూ ఉండేవారు. క్వారీ పేలుడు పదార్థాల వల్ల పేద రైతులు వాటికి భయపడి వెయ్యి ఎకరాలు సాగు చేయకుండా వదిలేస్తున్నారు..

దాసరి జనార్థన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు.

రోగాల బారిన పడుతున్నాం..

బ్రాహ్మణపల్లి చెరువు కింద సుమారు 600 ఎకరాలు రైతులు సాగు చేస్తూ అధిక దిగుబడి చూసేవారు. అయితే ఈ క్వారీ ఏర్పడిన తర్వాత క్వారీ నుండి వెలువడే దుమ్ము ధూళి పక్కనే ఉన్న చెరువులో కలవడం వల్ల పంట పొలాలకు వెళ్లే నీరు కలుషితమై పంటలు సక్రమంగా పండడం లేదని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని క్వారీ యాజమాన్యానికి పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు..క్వారీ నుండి వచ్చే శబ్ద కాలుష్యం వల్ల తమ నివాస ఇళ్లు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై క్వారీ యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు..సంబంధించిన అధికారులు స్పందించి వెంటనే క్వారీ వారిపై తగు చర్యలు తీసుకొని రైతులకు మేలు చేయాలి..

- నాగరాజు, రైతు.

క్వారీ వ్యర్థాలతో కలుషితమైన నీరు

క్వారీ పేలుళ్లతో రాళ్లు పడి ధ్వంసమైన దారి

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు రూరల్ మండలం ఉత్తరపు కండ్రిగ సమీపంలోని తిరుపతి –చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం నగరికి కాలినడకన నడిచి వెళుతుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో వ్యక్తి దేహం నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఎరుపు గళ్ల చొక్కా, నలుపు గళ్ల లుంగి ధరించి వున్న వ్యక్తి పుత్తూరు గణపతి నగర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు మండలంలోని చెన్నూరు గ్రామ సమీపంలో ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన మనోహర్ గూడూరులోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పని చేస్తుంటాడు. ఆదివారం వేకువన పనులు ముగించుకుని మనోహర్ సైకిల్‌పై చెన్నూరు గ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో చెన్నూరు సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మోటారుసైకిల్ పై వచ్చి మనోహర్‌ను అడ్డగించి అతనిపై దాడి చేసి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, 70 రూపాయలు నగదును అపహరించుకు వెళ్లారు. గాయపడిన మనోహర్‌ను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర మంత్రి అమిత్ షాకు స్వాగతం పలుకుతున్న మయూర్

అమిత్ షా కు మయూర్ స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబులకు శ్రీకాళహస్తి ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆదివారం విజయవాడలోని నోవాటెల్ హోటల్ లో ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రసాదాలు అందించి మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. మరో కేంద్రమంత్రి కింజవరపు రామ్మోహన్ నాయుడుని కలిసి ఎంజీఎం ఆసుపత్రి సందర్శనకు రావాలని ఆహ్వానించారు.

యోగి వేమనకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా యోగి వేమన జయంతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో యోగి వేమన జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వ హిం చారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జనార్ధన్ రెడ్డి, రోహిణి మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి, సంఘ సంస్కర్త, తత్వవేత్త అని ఆయన రాసిన పద్యాలు అందరికీ అర్థమయ్యే విధంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, డాక్టర్ జనార్ధన్ రెడ్డి , డాక్టర్ రోహిణి , దశరథ రామిరెడ్డి , సనత్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మండి శ్రీనివాసరెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, రాఘవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, వాసిరెడ్డి హరికృష్ణ రెడ్డి, మూలి హరనాథ్ రెడ్డి, పల్లమాల హరనాథ్ రెడ్డి, రాధా కృష్ణా రెడ్డి, కిషోర్ రెడ్డి, యరమాక కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆరోగ్యమే మహాయోగం పునఃప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

జీ తెలుగు ఛానల్లో ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు అందించే సలహాలు, సూచనలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే సమగ్ర సమాచారం అందించే కార్యక్రమం ఆరోగ్యమే మహాయోగం. 1278 ఎపిసోడ్‌లతో సుదీర్ఘకాలం పాటు ప్రసారమైన ఆరోగ్యమే మహాయోగం అశేష ప్రేక్షకాదరణ అందుకుంది. మరింత సమగ్ర సమాచారం, సరికొత్త సందేహాలు, సలహాలతో ఆరోగ్యమే మహాయోగం జనవరి 20న, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు జీ తెలుగులో పునఃప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి అన్నపూర్ణ వ్యాఖ్యతగా వ్యవహరించనుండగా ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు ప్రేక్షకుల సమస్యలు, సందేహాలకు సరైన సలహాలు అందిస్తారు. సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, శారీరక, మానసిక ఆరోగ్యానికి జీవన శైలిలో చేసుకోదగిన సూచనలు ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చు. ఆరోగ్యం, ఫిట్నెస్, ఆహారం, అందం.. మొదలైన అంశాలపై సమగ్ర సమాచారం పొందేందుకు మంతెన సత్యనారాయణ రాజు అందించే సూచనలు, సలహాల కోసం జీ తెలుగు అందిస్తున్న ఆరోగ్యమే మహాయోగం కార్యక్రమాన్ని తప్పక చూడాలని జి నెట్‌వర్క్ సంస్థ ఆదివార ఒక ప్రకటనలో పేర్కొంది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిఎస్ఎఫ్ నాయకులు

గిరిజన సాంస్కృతిక మహోత్సవంను జయప్రదం చేయండి : టీఎస్ఎఫ్

ప్రజాశక్తి - క్యాంపస్ :

ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతి క మహోత్సవాల గోడ పత్రిక పోస్టర్స్ ఆదివారం శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ప్రధాన ద్వారం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కరంస అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5,6 తేదీల్లో జాతీయస్థాయి గిరిజన సంస్కృతి ఉత్సవాలు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో గిరిజన సాంస్కృతిక మహోత్సవంను నాలుగు రాష్ట్రాల నుంచి గిరిజన కళాకారులు, ఆదివాసులు, తెలంగాణ కర్ణాటక చత్తీస్‌గడ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వివిధ కళాకారులు రానున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, చంద్రశేఖర్, చిరంజీవి, మల్లేష్, జగన్, నాగేంద్ర, శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

జిల్లా రవాణాశాఖాధికారి మురళీ మోహన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, ఏర్పేడు: వాహనదారులు తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా రవాణా అధికారి మురళీమోహన్, శ్రీకాళహస్తి మోటార్ వాహన తనిఖీ అధికారి దామోదర్ నాయుడు హెచ్చరించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పేడు సమీపంలోని టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఆటోలను వారు తనిఖీ చేశారు. ఆటోలలో ప్రయాణికులను పరిమితికి మించి తీసుకెళ్ల కూడదని సూచించారు. అన్ని రికార్డులు కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. జాతీయ రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే సర్వీస్ రోడ్ల వద్ద జాగ్రత్త వహించాలని సూచించారు.

వాహనదారులను తనిఖీ చేస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి మురళీమోహన్

ఖాళీలు భర్తీ చేయండి..

బ్యాంకు ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో నేతల డిమాండ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని ఉద్యోగులపై పని భారం తగ్గించి వారానికి ఐదు రోజుల పని దినాన్ని అమలు చేయాలని సిబిడబ్ల్యూఈయు జనరల్ అధ్యక్ష , కార్యదర్శి సంధాని జేపీ శర్మ కోరారు. ఆదివారం బ్యాంకు ఉద్యోగుల సర్వసభ్య సమావేశం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ దేశంలో చాలా బ్యాంకులు ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదని బ్యాంకులో ఉద్యోగులపైనే పని భారం అదనంగా పడుతోందన్నారు. వారు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వెంటనే ఖాళీ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోవాలని, అన్ని క్యాడర్లో ఖాళీలు గుర్తించి భర్తీ చేయాలని కోరారు. బ్యాంకుల ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేసి ప్రభుత్వ అధీనంలో నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండు రంగ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ, ఏఐబిఈఏ సెక్రటరీ బిఎస్ రాంబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంతో కమిటీ జనరల్ సెక్రెటరీ నదయవల్లీ బాబు , ఛైర్మన్ సి శ్రీనివాసుల రెడ్డి , డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మున్వర్ బాషా, వైస్ ప్రసిడెంట్ లలితా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తిరుపతి రష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ భవనంలో వాకర్స్ అధ్యక్షులు కేఎల్‌మూర్తి, కార్యదర్శి మునికృష్ణయ్య, వాకర్స్ వ్యవస్థాపకులు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ రవిరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను శాలువాతో ఘనంగా సన్మానించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజు ఉదయం లేవగానే ఒక గంట పాటు నడకవాలని, తరువాత వ్యాయామం చేయాలని అప్పుడే మనం ఆరోగ్యంగా వుండవచ్చని అలా చేయకపోతే బీపీ, షుగర్ వ్యాధిన పడి ఆరోగ్యాన్ని దెబ్బతింటాయన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ఉదయం లేవగానే వ్యాయామం చేసి తమ ఆరోగ్యాన్ని ఎవరికి వారే కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యుల వద్ద ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ రావిళ్ళ మాధవ నాయుడు, డాక్టర్ ఆరుముగం, గోపికృష్ణ, గుణశేఖర్ రెడ్డి, రఫీ అహ్మద్, వాకర్ సభ్యులు పాల్గొన్నారు.

సిపాయి సుబ్రమహ్మణ్యంకు బహుమతి అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విద్యార్థి ఉన్నత చదువుకు సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలం విద్యానగర్ కి చెందిన రిటైర్డ్ హోమియోపతి కాంపౌండర్ భూపతి పోలయ్య కుమారుడు భూపతి మోహన్ సాయి 2021 లో స్థాపించి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో విస్తరించిన సంస్థ ద్వారా పలు సేవలు అందిస్తున్నారు. అందులోభాగంగా చెన్నై అంజికరై లో నివసిస్తున్న విద్యార్థిని యామిని తండ్రి వృత్తి రీత్యా ఆటో డ్రైవర్, తన 12వ తరగతి లో 86 శాతం మార్కులు సాధించి ఉన్నత చదువులకు వెళ్లలేక సాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో తనకు కొందరు తెలిపిన అన్ బిన్ సువడగల్ సంస్థను ఆశ్రయించింది. తక్షణమే ఆ విద్యార్థినికి సంస్థ చెన్నై లోని శ్రీ కృష్ణస్వామి కాలేజీలో తనకు అడ్మిషన్ ఇప్పించి మొదట సెమిస్టర్ ఫీజును సంస్థ ద్వారా సాయం చేశారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని తన కాలేజీ రెండవ సెమిస్టర్ ఫీజును అన్ బిన్ సువడుగల్ సంస్థ (చెన్నై, ఆంధ్ర తెలంగాణ) ద్వారా 30,000 రూపాయలు నగదు చెక్కును ఆ సంస్థ డైరెక్టర్ భూపతి మోహన్ సాయి సమక్షంలో ప్రముఖ డాక్టర్ శామ్యూల్ సాత్విక్ చేతులు మీదగా అందించారు. వెంటనే సంస్థ ద్వారా సాయం అందిస్తున్న భూపతి మోహన్ సాయికి పలువురు అభినందనలు తెలిపారు.

డాక్టర్ శామ్యూల్ సాత్విక్ చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న విద్యార్థిని

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర పాఠశాల ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి 178వ 'పుష్యబహుళ పంచమి' ఆరాధనోత్సవం కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎందరో వాగ్గేయకారులు ఉన్నప్పటికీ సంగీతంలో కేవలం వాగ్గేయకారుడినే కాక సద్గురు త్యాగరాజస్వామిగా కాకర్ల త్యాగరాజు పేరు గాంచాడన్నారు. దాదాపు 250 సంవత్సరాల క్రితం తమిళనాడులో జన్మించాడని, వారి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకర్ల గ్రామానికి చెందినవారని పేర్కొన్నారు. వారు 24 వేల కీర్తనలు రచించినప్పటికీ కేవలం 736 కీర్తనలు మాత్రమే ప్రస్తుతానికి లభ్యమవుతున్నాయని, వాటిల్లో ఘనరాగ పంచరత్న కృతులు, తులసి పంచరత్న కృతులు లాల్గుడి పంచరత్న కృతులు ఇంకా నారద పంచరత్నాలు ఎన్నో రకాలైన ఉత్సవ సంప్రదాయ కృతులు, దివ్యనామ సంకీర్తనలు, కీర్తనలు కృతులు రచించి ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారన్నారు. ఆయన అంత్యకాలంలో నాద బ్రహ్మానంద భారతి నామధేయంతో సన్యాసాశ్రమం స్వీకరించారన్నారు. వాలాజీపేట వెంకటరమణ భాగవతార్, మానాంబుచావడి వెంకట సుబ్బయ్య, తంజావూరు రామారావు , థిల్లైస్థానం రామయ్యంగార్ మొదలైన శిష్యుల ద్వారా వీరికి కీర్తనలు ప్రచారమై నేటికీ మనకు లభ్యమవుతూ ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు నాదస్వర పాఠశాల అధ్యాపకులు, విశ్రాంత అధ్యాపకులు, విద్యార్థులు, తిరుపతికి చెందిన పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

ఏకసభ్య కమిషన్ పర్యటన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

21న సభను విజయవంతం చేయండి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: ఈ నెల 21వ తేదీ చిత్తూరులో నిర్వహించే ఏకసభ్య కమిషన్ పర్యటన ను విజయవంతం చేయా లని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పల్లిపాకు నాగరాజు పిలుపు నిచ్చారు. గంపల మాదిగపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లిపాక నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తూ పోరాడుతున్నారని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం చిత్తూరు జిల్లా కేంద్రంగా ఈ నెల 21న నిర్వహించే ఏకసభ్య కమిషన్ మహాసభకు మాదిగ ఉపకులాల ప్రజలు, అప్రజా స్వామిక వాదులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు తమ సమస్యలపై అర్జీలు, వినతులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల దళిత సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రం తీస్తే.. చిట్కా చెబుతుంది..!

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: విపత్తులకు తోడు చీడపీడలు అన్నదాతల్ని ఏటా ఇబ్బంది పెడుతున్నాయి. చీడపీడల్ని సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞా నంతో క్షణాల్లోనే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడుతుంది. రైతులకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందుబాటులోకి తెస్తోంది. చిత్రం తీసి పంపిస్తే చాలు. క్షణాల్లో సస్యరక్షణ చర్యలను నిపుణులు తెలుపుతారు.

రైతులకు కొత్త యాప్

కేంద్ర ప్రభుత్వం జాతీయ వీడపీడల నిఘా వ్యవస్థ మొబైల్ యాప్‌ను నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం (ఎన్పీఎస్ఎస్) పేరుతో సిద్ధం చేసింది. కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటె క్షన్, క్వారంటైన్, స్టోరేజ్ కార్యాలయం, ఐసీఏ ఆర్ శాస్త్రవేత్తల సహకారంతో దీన్ని రూపకల్పన చేశారు. రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి అప్పగించారు. వ్యవసాయశాఖ ఉద్యోగులకు దీనిపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మార్గదర్శకాలు చేశారు.

12 ప్రధాన పంటలకు..ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ సహాయంతో రైతులకు తక్షణమే శాస్త్రీయ పద్ధతిలో సలహా, సేవలు అందించేందుకు ఫొటో రిపోజిటరి సేవల్ని జిల్లాలో వినియోగించ నున్నారు. రాష్ట్రంలో క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌లో ప్రధాన పంటలైన వరి, మొక్క జొన్న, మినుము,పెసర, శనగ, పత్తి, చెరకు, వేరుసెనగ, ఎర్ర శనగ, ఎండు మిరప, పసుపు వంటి పంటల్ని నమోదు చేస్తారు. వివిధ పంటల దశలు, తెగుళ్లు, చీడ పురుగులు వాటిద్వారా నాశనానికి గురైన భాగాల ఫొటోలు తీసేందుకు వీలు కల్పించారు. ఈ–పంట నమోదు చేస్తున్న అందరికీ సస్యరక్షణ చర్యల్ని పొందే అవకాశమిచ్చారు.

పంటల చీడ పీడలపై నిఘా వ్యవస్థ

సేవలు.. ప్రయోజనాలివీ.. యాప్‌లో రైతు పేరు, చరవాణి నెంబరు, గ్రామం, పంట, పంట కాలం, దశ, చీడపీడల రకం, ప్రదేశం తదితర వివరాలను నిక్షిప్తం చేసుకోవచ్చు ఎప్పుటికప్పుడు పంటల సమాచారం, సస్యరక్షణ సలహాలు పొందవచ్చు. పంట పేరు నమోదు ఏ పురుగు సోకింది ? తెగుళ్లు ఉన్నాయా? లక్షణాలు ఎలా ఉంటాయి? నివారణ చర్యలు ఏం చేపట్టాలో సమగ్ర సమాచారం రైతుకు క్షణాల్లో వస్తుంది. దీనిద్వారా సమయం, ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచే అవకాశం ఉంటుంది.

స్మార్ట్ ఫోన్లు ఉంటే చాలు..అన్నదాతల్లో ఎక్కువమంది వద్ద స్మార్ట్ ఈ యాప్ను వినియోగిస్తే త్వరితగతిన చీడపీడలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. తెలుగు భాషలోనూ ఈ యాప్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయాధికారులు సిద్ధమవుతున్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- వెటర్నరీ ఏడీ ఏ సురేష్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 20 నుండి 31 వ తేదీ వరకు గూడూరు డివిజన్ పరిధిలో నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ ఏడిఏ సురేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువుల ఆరోగ్య రక్షణకు, పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. వైద్యుల సహాయంతో పశువులను పరీక్షించి , ఉచితంగా మందులు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. పాడి రైతులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.